సమస్యల పరిష్కారానికే 'గుడ్ మార్నింగ్'

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల


గ్రామస్తులతో కలిసి టీ తాగుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్, మార్చి 27: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపేటలో గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ మమత, ఎంపీటీసీ తోట సుజాత, నాయకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో కల్వకుంట్ల

కోరుట్ల, మార్చి 27: పట్టణంలోని 21వ వార్డులో బుధవారం మైనారిటీలు నిర్వహించిన ఇఫ్తార్ విందుకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల హాజరయ్యారు. ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఇఫ్తార్ విందులు హిందూ, ముస్లింల ఐకమత్యానికి నిదర్శనంగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అన్నం అనిల్, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలి

- డీఎంను కోరిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

డీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, మార్చి 27: గంగాపూర్, గుట్రాజ్‌పల్లి, అనంతారం గ్రామాల ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ డీఎం సునీతకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెల్గటూర్ నుంచి జగిత్యాల వయా గంగాపూర్, గుట్రాజ్‌పల్లి, అనంతారం గ్రామాల మీదుగా పాత బస్సు రూట్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజలు అనేక మార్లు బస్సు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారన్నారు. వ్యక్తిగతంగా తాను సైతం డీఎంకు వినతిపత్రాన్ని అందజేసినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు బస్సును ప్రారంభించి ఆ తర్వాత నిలిపివేశారన్నారు. ఎన్నికల తర్వాత ఆయా గ్రామాల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించిన బస్సు సౌకర్యం, మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిందని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి ప్రజలకు ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రజల రద్దీకి అనుగుణంగా అయా రూట్‌లలో నూతన బస్సులు కేటాయించాలన్నారు. రవాణా శాఖ మంత్రి దృష్టికి సైతం సమస్యను తీసుకెళ్తానని పేర్కొన్నారు. రద్దీకి అనుగుణంగా నూతన బస్సులు కేటాయించి, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు సౌకర్యం కల్పించాలని, జగిత్యాల డిపోకు 20 నూతన బస్సులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జగిత్యాల డీఎం సునీత, గుట్రాజ్‌పల్లి, గంగాపూర్ మాజీ సర్పంచులు బాల ముకుందం, జగన్, తదితరులు ఉన్నారు.

అనాథ యువకుడిని ఆదుకోండి

- రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న శేఖర్
- కరీంనగర్ ప్రైవేట్ దవాఖానలో చికిత్స
- వైద్య ఖర్చుల కోసం సాయం చేయాలని వేడుకోలు

చికిత్స పొందుతున్న లకావత్ శేఖర్

కథలాపూర్, మార్చి 27: రాజారాం తండాకు చెందిన లకావత్ శేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. నరాలు తెగిపోయి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని వైద్యులు తెలిపారు. కాగా, లకావత్ శేఖర్ తల్లిదండ్రులిద్దరూ మృతిచెందడంతో, ఆ యువకుడికి వైద్యం అందించేందుకు దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రతీ రోజు రూ. 50 వేల పైనే వైద్యానికి ఖర్చవుతుందని పేర్కొన్నారు. దాతలు సహకరించి ఆదుకోవాలని కోరారు. దాతలు ఫోన్ పే, గూగుల్ పే నెంబర్: 9347904935కు డబ్బు పంపి సహకరించాలని వేడుకుంటున్నారు.

తాగిన మైకంలో రాడ్డుతో బాది..

- భార్యను హత్య చేసిన భర్త

వెల్గటూర్, మార్చి 27: తాగిన మైకంలో కట్టుకున్న భార్యను రాడ్డుతో బాది కడతేర్చిన ఘటన ఎండపెల్లి మండలం మారేడుపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. బంధువులు, పోలీసులు వివరాల ప్రకారం.. ధర్మారం మండలం నర్సింగాపూర్‌కు చెందిన రజిత(38)కు మారేడుపల్లికి చెందిన వ్యాళ్ల పున్నంరెడ్డితో పదమూడేళ్లక్రితం వివాహమైంది. కాగా, కొంతకాలంగా పున్నంరెడ్డి తాగుడుకు బానిస కావడంతో భార్యాభర్తలిద్దరికీ నిత్యం గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా గొడవ కావడంతో తాగిన మైకంలో భర్త పున్నంరెడ్డి విచక్షణా కోల్పోయి భార్య తలపై రాడ్డుతో బాదాడు. ఈ దాడిలో రజిత అక్కడికక్కడే మృతి చెందింది. వీరికి పదకొండేళ్ల కూతురు ఉన్నది. రజిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి.. డయల్ 100కు ఫోన్

- స్పందించి ప్రాణాలు రక్షించిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్

జగిత్యాల కలెక్టరేట్, మార్చి 27: ఆత్మహత్య చేసుకుందామని పురుగుల మందు తాగిన ఓ యువకుడు డయల్ 100కు ఫోన్ చేశాడు. తక్షణమే స్పందించిన జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ జుబేర్ యువకుడిని రక్షించాడు. జగిత్యాల టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మణికుమార్ జగిత్యాలలో ఉంటున్న భార్య వద్దకు వచ్చాడు. కాగా మణికుమార్ బుధవారం గొల్లపల్లి రోడ్డు వైపు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం డయల్ 100కు ఫోన్ చేసి రక్షించమని వేడుకున్నాడు. డయల్ 100 సిబ్బంది జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌ను, బ్లూకోట్ సిబ్బందిని అప్రమత్తం చేయడంతో అటువైపుగా విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ పీసీ జుబేర్ తక్షణమే స్పందించాడు. పురుగుల మందు తాగిన మణికుమార్‌ను హుటాహుటిన జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించారు. వైద్యులు యువకుడికి చికిత్స అందిస్తున్నారు. యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఏరియా జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నప్పటికీ, తక్షణమే స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను పలువురు పోలీసు అధికారులు అభినందించారు. కాగా కుటుంబసమస్యల నేపథ్యంలోనే యువకుడు ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గల్ఫ్‌లో డబ్బుతిమ్మాయిపల్లివాసి మృతి

రవి (ఫైల్)

కొడిమ్యాల, మార్చి 27: పొట్ట కూటి కోసం దుబాయికి వెళ్లిన ఓ వ్యక్తి విధులు నిర్వర్తిస్తుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. డబ్బుతిమ్మాయిపల్లికి చెందిన అదరవేణి రవి (32) కొన్ని రోజుల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో విధులు నిర్వర్తిస్తుండగా మంగళవారం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రవికి భార్య మౌనిక, కుమారులు జ్ఞానేశ్వర్, కౌశిక్ ఉన్నారు. కాగా, కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే సత్యం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గోల్కొండ రాజు, ముత్యంరెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులున్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

అటవీ ప్రాంతంలో కందకాల పనులు పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్

సారంగాపూర్, మార్చి 27: రంగపేట, నాగునూర్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మదన్ మోహన్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బుధవారం ఆయా గ్రామాల్లో చేపడుతున్న కందకాల పనులు, వన నర్సరీలను పరిశీలించారు. ఉపాధి పనుల నిర్వహణ, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశం, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నరేశ్, అదనపు ప్రోగ్రాం అధికారి శ్రీలత, సాంకేతిక సహాయకుడు శివ, ఫీల్డ్ అసిస్టెంట్లు మల్లేశం, శంకర్‌రెడ్డి, కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ-నీట్ ఫౌండేషన్‌పై అవగాహన

జగిత్యాల, మార్చి 27: జిల్లా కేంద్రంలోని మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుధవారం పదో తరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ-నీట్ ఫౌండేషన్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ రజితా రావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లాలోనే మొట్ట మొదటి సారిగా పదోతరగతి విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఐఐటీ-నీట్ ఫౌండేషన్ ప్రోగ్రాం ప్రారంభిస్తున్న ఏకైక స్కూల్ మానస స్కూల్ అని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఐఐటీ, నీట్ ఫౌండేషన్‌లో 35 ఏండ్ల అనుభవం గల నిష్ణాతులు కోటేశ్వర్‌రావు(కెమిస్ట్రీ), శ్రీనివాసరాజు (మ్యాథ్స్), సుధాకర్ (ఫిజిక్స్) తదితరులు సలహాలు, సూచనలు ఇచ్చి విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మేడిపల్లి, మార్చి 27: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల, ట్రైబల్ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 6, 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. అల్లూనూర్ సీవోఈలోని తొమ్మిదో తరగతిలో మాత్రమే రెగ్యులర్ అడ్మిషన్ ఉన్నట్లు తెలిపారు.

పుస్తె, మట్టెలు అందజేత

మల్లాపూర్, మార్చి 27: గుండంపల్లికి చెందిన యువతి వివాహానికి బుధవారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పుస్తె, మట్టెలు అందజేశారు. బుధవారం యువతి వివాహానికి పుస్తె, మట్టెలు, పట్టు చీర, 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

5కే రన్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు

కోరుట్లలో 5కే రన్ విజయవంతం

కోరుట్ల, మార్చి 27: భారత ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశానుసారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలో 5కే రన్ నిర్వహించారు. కొత్త బస్టాండు నుంచి జాతీయ రహదారి మీదుగా నంది చౌరస్తా వరకు నిర్వహించిన 5కే రన్ ర్యాలీలో నియోజకవర్గంలోని బీఎల్‌వోలు, మున్సిపల్, రెవెన్యూ, ఉద్యోగులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, యువ ఓటర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్డీవో ఆనంద్ కుమార్ సూచించారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, కమిషనర్ తిరుపతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సారంగాపూర్, మార్చి 27: పది రోజుల క్రితం పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని మ్యాడారం తండా పంచాయతీ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్ఐ తిరుపతి వివరాల ప్రకారం .. తండాకు చెందిన మోతె నర్సవ్వ (49)కు కొంతకాలంగా మానసిక పరిస్థితి బాగా లేదు. దీంతో మనస్తాపం చెందిన నర్సవ్వ ఈనెల 17న పురుగుల మందు తాగింది. గమనించిన భర్త పోశం, స్థానికులు వెంటనే చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతున్న నర్సవ్వ బుధవారం మృతి చెందింది. నర్సవ్వ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, FAHIM FATHIMA, W/o. Syed Anwaruddin, R/o. 2-7-579, Mukarampura, Karimnagar, T.S. have Changed My Name as FAHEEM FATHIMA, W/o. Syed Anwaruddin. NT-328852

★I, SHEELAM SAILEKH RAJ, R/o. 10-5-17/1, Kisan Nagar, Karimnagar, T.S. have Changed My Name as SHEELAM VISHWA SAI LEKH RAJ, S/o. Chiranjeevi. NT-328852

★I, ALLADI SHYLEJA, R/o. 3-6-510/1, Subhash Nagar, Karimnagar, T.S. have Changed My Name as ALLADI SHAILAJA, D/o. Alladi Vykuntam. NT-328852

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

కొండగట్టు హుండీ ఆదాయం రూ.1.11 కోట్లు

మల్యాల, మార్చి 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలోని ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లోని 12 హుండీలను బుధవారం లెక్కించారు. 48 రోజులకు గానూ రూ.1,11,07,329 ఆదాయం సమకూరినట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. మిశ్రమ బంగారం 74 గ్రాములు, మిశ్రమ వెండి 5.5కిలోలు, విదేశీ కరెన్సీ 40 నోట్లు ఆదాయం రూపంలో సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పరిశీలకుడు సంజీవరెడ్డి, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

పసుపు @ రూ.15,559

మెట్‌పల్లి, మార్చి 27: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.15,559 ధర పలికింది. కనిష్ఠంగా రూ.3,100, పసుపు గోళకు గరిష్ఠంగా రూ.13,637, కనిష్ఠంగా రూ.3,535, పసుపు చూరకు గరిష్ఠంగా రూ.12,095, కనిష్ఠంగా రూ.3,100 ధర పలికింది.

చలివేంద్రాలు ప్రారంభం

పెగడపల్లి/సారంగాపూర్, మార్చి 27: వేసవిని దృష్టిలో పెట్టుకుని పెగడపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మూడు చలివేంద్రాలను ఎంపీవో మహేందర్ ప్రారంభించారు. సారంగాపూర్ మండలం నాయకపుగూడెంలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి నాగరాజు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

కోరుట్ల, మార్చి 27: పట్టణంలోని పద్మశాలీ సంఘం భవనంలో కరీంనగర్ మెడికవర్ దవాఖాన ఆధ్వర్యంలో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దవాఖాన గుండె వైద్య నిపుణుడు శ్రావణ్ పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి, మార్చి 27: సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసానిచ్చారు. ల్యాగలమర్రిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం కనుల పండువగా చేపట్టారు. గ్రామంలో నూతనంగా సీతారామచంద్రస్వామి ఆలయం నిర్మించగా, మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో సీతారామచంద్రస్వామి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళి శోభ, జడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీటీసీ అంజయ్య, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

అనుమతి గోరంత.. తవ్వేది కొండంత!

- విట్టంపేట వరదకాలువ నుంచి విచ్చలవిడిగా బండ తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మెట్‌పల్లి రూరల్: వరదకాలువ నుంచి బండరాళ్లను తీస్తున్న ఎక్స్‌కవేటర్

మెట్‌పల్లి రూరల్, మార్చి 27: మెట్‌పల్లి మండలంలో సహజ వనరుల సంపదను అక్రమార్కులు విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారు. గోరంత అనుమతులు తీసుకొని కొండంత తవ్వకాలు చేపడుతూ వరదకాలువ గుట్ట నుంచి బండను తరలిస్తున్నారు. పరిమితులకు మించి బండ తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం విట్టంపేట శివారులోని ఇందిరమ్మ వరదకాలువ నుంచి (36వ కిలో మీటర్ నుంచి 38వ కిలోమీటర్) బండరాయి తవ్వకాలకు 2024 మార్చి 3 నుంచి ఏప్రిల్ 2 వరకు 30 రోజులకు సత్తక్కపల్లి శివారులోని ఓ క్రషర్ యజమాని అనుమతులు పొందాడు. కానీ అనుమతికి మించి బండ తరలింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 200 మెట్రిక్ టన్నుల బండ తరలింపునకే ఇరిగేషన్ అధికారుల నుంచి అనుమతి పొందారు. గుత్తేదారు ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ. 150 చొప్పున మొత్తం రూ. 30 వేలను చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాడు. అలాగే మైనింగ్ ఇతర చార్జీ లు రూ.27, 560 చలానా కట్టాడు. అయితే ఇక్కడ సుమారు 25 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల టిప్పర్ల సాయంతో ప్రతిరోజూ ఎనిమిది ట్రిప్పులకు మించి బండరాళ్లను తరలిస్తున్నట్లు విమర్శలున్నాయి. అంటే రోజుకు 200 మెట్రిక్ టన్నుల చొప్పున ఇప్పటికే పాతిక రోజుల్లో ఐదు వేల టన్నులకు మించి బండరాళ్లను తరలించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతున్నది.

చర్యలు తీసుకుంటాం

200 టన్నుల బండ తరలింపునకు మాత్రమే అనుమతిచ్చాం. అనుమతికి రూ. 58 వేల వరకు చలానా కట్టారు. అనుమతికి మించి బండరాళ్లను తరలిస్తున్నట్లు దృష్టికి వచ్చింది. ఇప్పటికే డీఈని పరిశీలించాలని ఆదేశించాం. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఈఈ, మెట్‌పల్లి

లాభాల బాటలో సింగిల్ విండో

కొడిమ్యాల, మార్చి 27: కొడిమ్యాల సింగిల్ విండో సొసైటీ లాభాల బాటలో ఉందని సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సోసైటీలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ యేడు రూ. 17 లక్షల 40 వేలు లాభం వచ్చిందన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. నాలుగు గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు తీసుకున్న గన్నీబ్యాగ్‌లను తిరిగి సొసైటీకి అప్పగించాలన్నారు. పూడూర్‌లో సింగిల్ విండో సొసైటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సావనపల్లి రమేశ్, గడ్డం కవిత, సీఈవోలు గంగాధర్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న రాజనర్సింగరావు

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి: కలెక్టర్

జగిత్యాల, మార్చి 27: ప్రణాళికబద్ధంగా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. సమీకృత కార్యాలయంలో యాసంగి వరి ధాన్యం కొనుగోలుపై కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యాసంగి 2023-24 సీజన్‌లో జిల్లాలో 1,18,824 హెక్టార్లలో వరి సాగు చేశారని తెలిపారు. 5,65,241 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు కోసం ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ. 2203, బీ గ్రేడ్‌కు రూ.2183గా నిర్ణయించామన్నారు. జిల్లాలో ఐకేపీ- 133, పీఏసీఎస్ -282, మొత్తం 416 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రెండు ప్యాడీ క్లీనింగ్ మిషన్లను అందుబాటులో ఉంచాలన్నారు. బస్తాకు 40.650 కేజీలు మాత్రమే తూకం వేయాలని సూచించారు. కొనుగోలు చేసిన మూడు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్రమ పద్ధతిన టోకెన్ జారీ చేయాలని ఏఈవోలకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చేలా రైతులకు ముందుగానే సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. రాబోయే కాలంలో పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

కలికోటలో చెక్‌పోస్టు తనిఖీ

కథలాపూర్, మార్చి 27: కలికోట గ్రామశివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు బుధవారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ఎన్ని వాహనాలు తనిఖీ చేశారా..? అక్రమంగా తరలిస్తున్న డబ్బు, మద్యాన్ని పట్టుకున్నారా..? అని ఆరా తీశారు. అనంతరం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల వేళ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్ఐ నవీన్‌కుమార్ ఉన్నారు.

రూ.55 వేలు సీజ్

సారంగాపూర్, మార్చి 27: కోనాపూర్ శివారులోని బ్రిడ్జి సమీపంలో బుధవారం వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి సరైన ఆధారాలు, పత్రాలు లేకుండా రూ. 55 వేలు తీసుకెళ్తుండడంతో పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. నగదును గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా రూ.50వేల వరకు మాత్రమే వెంట తీసుకెళ్లాలని సూచించారు.

కలికోటలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

కేసీఆర్ హయాంలో ఆలయాలకు అత్యధిక నిధులు

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

సారంగాపూర్/జగిత్యాల రూరల్/మేడిపల్లి/కథలాపూర్, మార్చి 26: గత కేసీఆర్ హయాంలో ఆలయాలకు అత్యధిక నిధులు కేటాయించినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మి, సారగమ్మ, బంగారు పోచమ్మ, ముత్యాల పోచమ్మ అమ్మవార్లకు గ్రామస్తులు నూతన ఆలయాలను నిర్మించగా, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. అలాగే పోలారంలో అయిలవేని మల్లికార్జున స్వామి విగ్రహ ప్రత